


# మహాపురుష లక్షణం

"వ్సన ఎదురుగా కొత్తగా కట్టిన ఇంట్లో 'ఆర్. టి వో.' ఆఫీసు పెట్టేరు. ఇంక మీరు స్కూటరు షెడ్డు కట్టడానికి ఎక్కడికో దూరంగా వెళ్ళాల్సిన అవసరం లేదు. ఎదురింటిని ఆఫీసుకోసం పదిహేను సంవత్సరాలు 'లీజు' తీసుకున్నారట!" అంది మా ఆవిడ నాకు మజ్జిగ వడ్డిస్తూ.

"పిల్లల్ని మాత్రం జాగ్రత్తగా చూసుకో! 'ఆర్. టి. వో.' ఆఫీసు అనగానే రోజూ బోలెడు కార్లు, స్కూటర్లు, లారీలు ఇటే వస్తూవుంటాయి. రోడ్డు మహా రద్దీగా తయారవుతుంది. మన పిల్లలు ఇంట్లోంచి రోడ్డుమీదకు రాకెట్‌లా దూసుకుపోతూ వుంటారు. వాళ్ళని ఓ కంట కనిపెట్టి వుండక

పోతే ఏ లారీక్రిందో పడతారు" అన్నాను చేతులు కడుక్కొని ఆదరా బాదరాగా ఆఫీసుకు తయారవుతూ. ఆ హెచ్చరికతో 'ఆర్. టి. వో.' ఆఫీసు గురించి పూర్తి జాగ్రత్త తీసుకున్నానని పొరపడ్డాను నేను!

అక్కడితో ఆ సమస్య తీరిపోయిందనుకున్నాను!

కాని, నిజానికి కథ అక్కడే ఆరంభమయింది!!

* * *

ఆ మరుసటి మధ్యాహ్నం లంచ్ సమయంలో 'అర్జెంటు స్టేట్‌మెంట్లు' టైపు చేస్తూ వుంటే లక్ష్మణమూర్తి వచ్చాడు. వాడు మా సెక్షన్ లోనే సీనియర్ క్లార్కు. మేమందరం ముద్దుగా వాణ్ని జిడ్డు లక్ష్మణమూర్తి అని పిల్చుకుంటాం! "బ్రదర్! నేను పాత పోస్టాఫీసు దగ్గర వుంటున్నాను. నీకు తెలుసుకదా!" అంటూ ఆగేడు. తర్వాత గొంతుక సవరించుకున్నాడు. కుర్చీ నా టేబిలుదగ్గరగా లాక్కుని అందులో కూలబడ్డాడు. నుదిటిమీద పడుతున్న ముంగురులని సినీమా హీరోలా సర్దుకున్నాడు. జేబులోంచి సిగరెట్టు తీసి దాన్ని అగ్గిపెట్టెమీద దట్టించటానికి మెల్లిగా కొట్టి తర్వాత వెలిగించేడు.

విలాసంగా పొగ వదుల్తూ మళ్ళీ అడిగేడు "నేను పాత పోస్టాఫీసు దగ్గర వుంటున్నాను తెలుసుకదా?"

రవంత చికాకు కల్గినా అది మొహంలో కనబడనీయకుండా "ఎందుకు తెలీదూ?" అంటూ ఎదురు ప్రశ్న వేశాను.

"పాత పోస్టాఫీసు నుండి మధురానగర్‌కి— అంటే మీ ఇంటికి దూరమెంత?" అని మళ్ళీ ప్రశ్నించాడు— ఉపోద్ఘాతంతో ఎదుటి మనిషిని తినేస్తాడు! అసలు సంగతి చెప్పడు!

"సుమారు నాలుగు కిలోమీటర్లు వుండొచ్చు!" అన్నాను నా చికాకు అణిచిపెట్టుకుంటూ.

"అంటే మీ యింటికి రావాలంటే ఎన్ని సిటీబస్సులు మారాలి?"

"మునుపటి రోజుల్లో అయితే ఒకటే! ఇపుడు 'నోడల్ సర్వీసు'

వచ్చింది కదా! ప్రక్క స్టాపుకు వెళ్ళాలంటే 'ఆర్. టి. సి. కాంప్లెక్స్' వెళ్ళి మళ్ళీ పక్క స్టాపుకు రావాలి! అంటే కనీసం రెండు బస్సులు మారాలి!" అన్నాను టైపింగు ఆపేస్తూ. ఇంకెలాగూ నా పని తెమలదు! కనీసం వాడిపని అయినా తెమిల్చి పంపితే ధన్యుడనవుతాను!

ప్రక్క స్టాపుకు వెళ్ళాలంటేనే రెండు బస్సులు మారాలంటే మీ ఇంటికి రావాలంటే కనీసం మూడు బస్సులు మారాలి! అంటే అధమ పక్షం మూడు ముప్పయిలు తొంభయి పైసలు! రానూపోనూ రూపాయి ఎనభై పైసలు! అదీకాక ఒక్కొక్క బస్సుకోసం అధమం ఒక జీవిత కాలం నిరీక్షించాలి! అంటే మీ ఇంటికి రావటానికి మూడు జీవితకాలాలు పడుతుంది! కానీ, ఈ జీవిత కాలంలో అర్జంటుగా నేను నిర్వహించవల సిన బాధ్యత ఒకటుంది! అది నా 'డ్రైవింగ్ లైసెన్సు'కు ఫోటోలు అంటించి 'ఆర్. టి. వో.' ఆఫీసులో సంతకాలు పెట్టించటం! ఈమధ్య కొత్తగా రూలు వచ్చింది కదా! లైసెన్సు దగ్గరలేకుండా కనీసం 'మోపెడ్' తొక్కినాసరే, వాళ్ళు పట్టుకున్నారంటే తడిసి మోపెడు అయి పోతుంది మనకి! అందుకని నువ్వు నాకీ సహాయం చేయాలి! ఇవిగో ఫోటోలు! 'ఇది నా డ్రైవింగ్ లైసెన్సు.' ఈ పని చేయించావంటే నీ ఋణం మరో విధంగా తీర్చుకుంటాను!" అన్నాడు.

ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వాడి నుండి ఫొటోలు, కాగితం లాక్కొని డ్రాయరులో పడేశాను.

"ఈ మాత్రానికేనా? తప్పకుండా చేయిస్తాను!" అంటూ అతడివేపు 'ఇక నువ్వు వెళ్ళొచ్చు!' అన్నట్లు చూసేను.

వాడు వెళ్ళిన రెండు నిమిషాలు తిరక్కుండానే బైరాగిమూర్తి వచ్చాడు! వాడు లాబరేటరీలో టెక్నికల్ అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు. లాబరెటరీ కూడా మా ఆఫీసు బిల్డింగులోనే ఒక వైపుకు వుండటం వల్ల, సాధ్యమయినంతవరకూ 'ఎక్కవుంట్సు సెక్షను'లోనే తిరుగుతూ

వుంటాడు వాడు. 'కార్మికులకి కొత్తగా అప్పులిచ్చే పథకాలు యేవైనా వచ్చాయా?' అంటూ నిరంతరం అన్వేషిస్తూ వుంటాడు.

"అమ్మయ్యా! లంచ్ సమయంకదా, ఎటయినా వెళ్ళిపోయావేమో ననుకున్నాను!" అంటూ కుర్చీలో సెటిలయిపోయాడు.

"ఏమిటి కథ?" అన్నాను.

"ఈవేళ ఉదయం సౌజన్యంగారు మా యింటికి వచ్చేరు" అన్నాడు.

"సౌజన్యంగారు ఎవరు?" అన్నాను.

నా తెలియని తనానికి సిగ్గుపడుతున్నట్లు తల ఆడించి తర్వాత ఫెళ్ళున నవ్వేడు బైరాగిమూర్తి.

"సౌజన్యంగారు తెలీదూ? నువ్వు ఆంధ్రప్రదేశ్‌లో వుంటున్నావా? అండమాన్ నికోబారు దీవుల్లో వుంటున్నావా?" అంటూ ఎదురు ప్రశ్న వేశాడు.

తెల్లబోయినట్లు కాసేపు మౌనంగా వుండిపోయాను.

"సౌజన్యంగారు ఇంతకుముందు ప్రభుత్వంలో సెక్రెటరీగా పని చేశారు. ఈమధ్యనే కొత్త ప్రభుత్వం వచ్చాక రాజీనామా చేసి యీ వూరు వచ్చి 'పండరీపురం'లో యిల్లు కట్టుకుని సెటిల్ అయిపోయారు. మా యింటి యెడంప్రక్క యిల్లే ఆయనది! కుడిప్రక్క యిల్లు తెలుసు కదా, మాజీ రాష్ట్రపతిగారి అల్లుడు తమ్ముడిది! అంటే వీరేశ్వరప్రసాద్ గారన్నమాట! మా ఎదురిల్లు మాజీ పాడి పరిశ్రమ శాఖా మంత్రిగారిది! ఏవో గొడవలొస్తే అప్పట్లో రాజీనామా చేసేరులే! ఆయన యింట్లో స్విమ్మింగ్‌పూల్ కూడా వుంది! కాస్త అవతలికి వెళ్తే రంజిత్ గారిల్లు! ఆయన దుబాయ్‌లో ఇంజనీరుగా వుంటున్నారు. నెలకి ముప్ఫయివేలు జీతం! ఆయన యింటి కిచెన్‌లో పెట్టిన పొగగొట్టం అమెరికాలో వెయ్యి డాలర్లు పెట్టి కొన్నారట! నేలమీద పరిచిన రాళ్ళు బేతంచెర్ల నుండి డబుల్ పాలిష్ పెట్టి తెప్పించారు. కాస్త సముద్రం వేపుకు వెళితే మన

రాజుగారిల్లు! చాలా మంచివాడు। నేను ఇల్లు కడుతూ వుంటే నాకు సిమ్మెంటుకు సహాయం చేశాడు! వీళ్ళందరూ మనకి స్నేహితులయి పోయారు। ఇంతమంది స్నేహితులయిపోవటం వల్ల మనకి 'ఆబ్లిగేషన్స్' తప్పటంలేదు। ఇంతకీ నేను యేదో చెప్పబోయి బోలెడు కథ చెప్పేశాను! నేను ఎవరి గురించి మాట్లాడుతున్నానో జ్ఞాపకం వుందా?" అంటూ ఆగేడు.

నాకు అప్పటికే కుర్చీలో చిన్న కునుకు పడుతోంది। వాడి ఆఖరు ప్రశ్నతో తెలివి వచ్చింది.

అర్జెంటు పేపర్లు టైపు చేయటం అవలేదు. అది అయితేగాని భోజనానికి వెళ్ళటం కుదరదు। ఆకలి, నీరసం అన్నీ ముంచుకొస్తు న్నాయి.

బైరాగిమూర్తి వదిలిపెట్టేలా లేడు!

"నువ్వు పాంచజన్యంగారి గురించి మాట్లాడినట్లు జ్ఞాపకం...." అంటూ ఆవులించి చిటికెలు వేసుకున్నాను.

"మధ్యాహ్నం పూట ఆవులింతలేమిట్రా? అదీ ఆఫీసులోనా? అంటే నీ ఆరోగ్యంలో యేదో లోపం వుందన్నమాట। మధ్యాహ్నం ఆవులించటం చాలా చెడ్డ లక్షణమని నిన్న సాయంకాలం మాలతీ కేస్కర్ చెప్పింది....మాలతీ కేస్కర్ తెలుసుకదా?"

"తెలీదు!"

మళ్ళీ పెళ్ళున నవ్వాడు బైరాగిమూర్తి।

"మాలతీ కేస్కర్ వుమెన్స్ కాలేజీలో కరాటే ఫైటింగ్ నేర్పు తుంది. ఫల్గుణా కేస్కర్ కూతురు! ఆయనకి ఊరు చివర పెద్ద బిస్కట్ల కంపెనీ ఉంది! యు. పి.లో ఒక పేపరు మిల్లులో బోలెడుషేర్లువున్నాయి. నేనూ, మాలతీ కేస్కర్ కలిసి రోజూ మార్నింగ్ వాక్‌కి వెళుతూంటాం। మా ఆవిడ పర్మిషన్ ఇచ్చిందిలే। అవును! మీ అబ్బాయికి ఇంటర్మీడి యట్‌లో సీటు దొరికిందా?" అన్నాడు.

"ఇంతవరకూ దొరకలేదు! అన్ని కాలేజీలకూ అప్లికేషన్లు పెట్టాను! నువ్వు కాస్త సహాయం చేయరాదూ?" అన్నాను.

"నువ్వేం భయపడకు! మీ అబ్బాయికి సీటు ఖాయం అన్నాడు.

నా చెవులను నేనే నమ్మలేకపోయాను!

"నీకు చాలా ఋణపడి వుంటాను!" అన్నా.

"శివనారాయణమూర్తిగార్కి చెప్తానులే! ఇంతకీ శివనారాయణమూర్తిగారంటే ఎవరనుకున్నావ్?" అన్నాడు.

తెలియనట్లు మొహం పెట్టేను.

నా అజ్ఞానానికి మళ్ళీ ఫెళ్ళున నవ్వేడు బైరాగిమూర్తి.

"ఒక ప్రముఖ కాలేజీకి సెక్రటరీ! రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవా? ఆయన తల్చుకుంటే కాలేజీలో సీటు తక్షణం ఇప్పించగలడు. అయినా మా "పండరీపురం లే అవుట్"లోనే ఇల్లు కట్టుకున్నారు. నీకు భాగ్యరాజా తెలుసుకదా? వాళ్ళింటి ప్రక్కదే శివనారాయణమూర్తిగారిల్లు!" అన్నాడు,

మళ్ళీ దొరికిపోయాను.

"భాగ్యరాజా ఎవరు?" అన్నాను.

ఈసారి వాడు నవ్వలేదు! నా వంక అడివి మనిషివేపు చూసినట్లు చూశాడు.

"నీకు శ్రీ ఎన్. టి. రామారావు తెలుసా?" అన్నాడు.

సిగ్గుతో "ఎందుకు తెలీదూ?" అన్నాను.

"హైదరాబాద్కు ఎన్. టి. రామారావు ఎలాగో, మన విశాఖపట్నానికి భాగ్యరాజా అలాగ! ఆయనకి పొజిషన్ ఉంది, ఈయనకి పొజిషన్ లేదు, అంతే తేడా! ఈయనకి ఈ పూళ్ళో అపోజిషన్ కూడా లేదు, అదీ సంగతి! నువ్వీ విశాఖపట్నంలో బ్రతకటానికి పనికిరావు!" అన్నాడు.

భాగ్యరాజాను గురించి కనీసం ఇంతవరకూ నేను విననందుకు సిగ్గుపడ్డాను.

"ఇంతకీ నేను ఎవరిగురించి చెప్తున్నానూ?...."

"పాంచజన్యంగారి గురించి...." అన్నాను.

"పాంచజన్యంగారు కాదు, సౌజన్యంగారు....ఆయన ఉదయం స్వయంగా మా ఇంటికి వచ్చేరు. వచ్చి ఓ చిన్న సహాయం చేయమన్నారు. ఆయన లైసెన్సుకి ఫోటోలు అతికించి ఆఫీసులో సంతకాలు చేయించాలిట! చేస్తానని మాట ఇచ్చి అవి తీసుకున్నాను. ఆయన పెద్దవాడుకదా! మనం సహాయం చేస్తే పుణ్యం, పురుషార్థం దక్కుతాయి. ఎలాగూ ఆ ఆఫీసు మీ ఇంటిముందే కదా! నీకిచ్చి పోదామని వచ్చేను! ఈపని చేయించి రేపు సాయంకాలం మీ అబ్బాయిని తీసుకురా, శివనారాయణమూర్తిగారికి పరిచయం చేస్తాను." అని రెండు క్షణాలాగి "రేపు వద్దులే! ఎల్లుండి సాయంకాలంరా!" అన్నాడు.

"అలాగే! ఆ కాగితాలు ఇవ్వు!" అంటూ బైరాగిమూర్తి దగ్గర నుండి సౌజన్యంగారి లైసెన్సు కాగితం, ఫొటోలు తీసుకున్నాను.

"రేపు సాయంకాలం నిన్ను ఎందుకు రావద్దన్నానో తెలుసా?" అంటూ అడిగేడు.

"తెలీదు!"

"రేపు సాయంకాలం భాస్కర్ మహాదేవ్ వాళ్ళింటికి "టీ"కి పిల్చేరు! అక్కడికి వెళ్ళాలి. మా పండరీపురంలోనే సముద్రపొడ్డు ఇల్లు వాళ్ళది. మహదేవ్ తెలుసుకదా!" అన్నాడు.

తెలియదనబోయి నాలిక్కరచుకొని ఊరుకొన్నాను.

మహదేవ్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టరు. లక్షలకొద్దీ వ్యాపారం ఈ వూళ్ళో నాలుగు ఐస్ మిల్లులున్నాయి.

వాళ్ళ వూరులో ఆరు ఐస్‌మిల్లులు ఉన్నాయి. మా ఆవిడకీ వాళ్ళ ఆవి

దకీ మంచి దోస్తి! నాకు ఎప్పుడయినా అర్జెంటుగా ఫోన్ చేయాలంటే వాళ్ళింటికి చెయ్! నెంబరిస్తాను! వెంటనే కబురు పెడతారు!" అన్నాడు.

"అయితే నీకు పెద్ద పెద్ద వాళ్ళందరూ మిత్రులయిపోయారన్న మాట!" అంటూవాడిచ్చిన కాగితాలు జాగ్రత్త చేశాను.

బైరాగిమూర్తి కుర్చీలోంచి లేస్తూ "ఈవేళ తిధిఏమిటి?" అన్నాడు సీరియస్‌గా.

"ద్వాదశి" అన్నాను— ఎందుకు అడిగాడో అర్థంకాక చూస్తూ.

"ఈవేళ ద్వాదశి. అంటే రేపు త్రయోదశి. ఎల్లుండి చతుర్దశి. తర్వాత పౌర్ణమి!" అని గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు. వాడు వెళ్ళిన వంకే తేరిపారచూస్తూ వుండిపోయాడు. అంతలోనే నాయుడు హడావుడిగావచ్చి "పున్నమినాగు వెళ్ళిపోయాడా?" అన్నాడు.

అర్థంకానట్లు నాయుడువంక చూశాను.

"వాడే బైరాగిమూర్తి! వాడు బీచ్ దగ్గరలో ఇల్లు కట్టుకోవటం కాదుకాని పున్నమి ముందు మూడు రోజులు, తర్వాత మూడురోజులు సాయంకాలం నుంచీ రాత్రివరకూ బీచ్‌లో ఇసకలోపడి దొర్లుతున్నాడు. "పండరీపురం లేఅవుట్"లో పెద్దవాళ్ళ మధ్య వీడిల్లు కట్టేడు కదా, అప్పటినుండి వీడి ధోరణి మారిపోయింది" అన్నాడు నాయుడు.

"అవును మరి! విశాఖపట్నంలో "పండరీపురం లేఅవుట్" అంటే బొంబాయిలో "జుహూబీచ్" ఏరియాలాంటి దన్నమాట! విశాఖపట్నానికి అదొక "స్టేటస్ సింబల్!" ఇంత సుందరమైన సముద్రపొద్దు, అందులోనూ పండరీపురంలాంటి కాలనీ, మరి ఆసియాలో ఎక్కడా కన్పించదని ప్రఖ్యాత సినీ దర్శకుడు భానుచందర్ "కాకమ్మకథ" సినిమాషూటింగ్ సందర్భంలో అన్నాడట! ఆ మాట కూడా బైరాగిమూర్తి చెప్పేడు!" అన్నాను.

"అదుగో నా డ్రైవింగ్ లైసెన్సు, ఇదిగో ఫోటోలు. ఇవి ఆర్.

టి. వో. ఆఫీసులో ఇచ్చి సంతకాలు చేయించిపెట్టు!' అంటూ చనువుగా ఓ కవరు నా దగ్గిర పడేసి" బైరాగిమూర్తితో పనుంది। మళ్ళీ వస్తాను।" అంటూ వెళ్ళిపోయాడు నాయుడు.

ఈమధ్య బైరాగిమూర్తి పేరు అందరి నోళ్ళల్లోనూ ఆడుతోంది.

ఎప్పుడో పది సంవత్సరాల క్రితం "వుడా"కి ఎప్లయిచేస్తే వాళ్ళు బైరాగిమూర్తికి "పండరీపురం లేఅవుట్"లో స్థలం కేటాయించారు. ఆ స్థలంలో కంపెనీవాళ్ళు ఇచ్చిన అప్పుతో ఓ ఇల్లు కట్టేశాడు. అందిన చోటల్లా అప్పుచేసి మొత్తానికి ఇల్లు పూర్తయిందనిపించాడు. నాడా దొరికిందికదా అని గుర్రాన్ని కొన్నట్లయింది వాడి పరిస్థితి! చుట్టూ కాలనీలో పెద్దపెద్ద భవనాలు లేస్తుంటే వాటితోపాటు పరుగు పెట్టటంతో కాస్త ఇరుకున పడ్డాడు. అయితే ఆ ఇంటితో వాడి స్టేటస్ పెరిగిపోయింది! — కాదు! వాడే పెంచేసుకున్నాడు. సెక్రెటరీలు, ప్రొఫెసర్లు, బడా కాంట్రాక్టర్లు, మాజీ మంత్రులు, స్పెషలిస్టులు: వీళ్ళుతప్ప మామూలు మనుషుల్ని రిఫర్ చెయ్యటం మానేశాడు. వాడు చేస్తున్నది "టెక్నికల్ అసిస్టెంటు" ఉద్యోగమయినా మాటలు మాత్రం "అసిస్టెంటు డైరెక్టరు" లెవల్లో వుంటున్నాయి.

సరే। ఈ ఆర్టీవో ఆఫీసు మా ఎదురింటిలోకి రావడంవల్ల చిన్న రకం కష్టాలు ప్రారంభమవుతున్నాయని మెల్లిగా తెలియవచ్చింది!

లైసెన్సులు, ఫొటోలు అన్నీ కలిపి ఒక కవరులోసర్ది నాబ్యాగులో పడేసుకున్నాను.

ఆ సాయంకాలం ఇంటికి బయలుదేరటానికి ఇంకా పది నిమిషాలు సమయం వుందనగా మా బాస్ రూం నుంచి పిలుపు వచ్చింది.

హడావుడిగా వెళ్ళేను।

"కూర్చోవోయ్!" అన్నారు.

ఉద్యోగంలో అడుగు పెట్టేక మా బాస్ కూర్చోమని నాకు చెప్పటం ఇదే ప్రథమం! ఉబ్బితబ్బిబ్బయ్యాను।

"ఫర్వాలేదు సార్!" అంటూ నిలబడే వుండిపోయాను.

"కూర్చో!" అన్నారు మళ్ళీ.

ఇంక తప్పదని, కుర్చీ కందిపోతుందన్నట్లు కూర్చున్నాను.

"ఆర్. టి. వో. ఆఫీసు మీ ఎదురింట్లోకి మార్చారుటకదా!" అన్నారు.

ఆహా! ఏమి నా భాగ్యము? ఆర్. టి. వో. ఆఫీసు మా ఎదురింట్లోకి మార్చినందుకు మొట్టమొదటిసారిగా సంతోషించాను.

"అవును సార్!"

"నువ్వు నాకు సహాయం చెయ్యాలోయ్! ఇంతకీ ఆ ఆఫీసులో నీకు ఎవరయినా తెలుసునా?"

"అబ్బే.... తెలియకపోవటమేమిటి సార్! బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు మనకి ఫ్రెండ్స్! కొత్త ఆర్. టి. వో. గారు మా వేలు విడిచిన మేనమామకి తోడల్లుడే!" అంటూ అర్జెంటుగా అబద్ధాలు ఆడేశాను.

మా బాస్ నా వంక క్షణంసేపు అదోలా చూశారు.

"కొత్తగావచ్చిన ఆర్టీవోగారు నాయుడుగారుకదా.... నువ్వేమో...." గొంతులో వెలక్కాయ పడ్డట్లయింది! అబద్ధాలు కూడా ఎన్ని ఆపదలు తెచ్చిపెడతాయో అవగతమయింది. రోటిలో తలదూర్చి రోకటిపోటుకు వెరవదీరునా?

అర్జెంటుగా మరో అబద్ధం 'ఫేబ్రికేట్' చేశాను.

"మా మేనమామది ఇంటర్‌కేస్ట్ మేరేజీలెండి!" అన్నాను చిర్నవ్వుతో.

"బసీ! వెరీగుడ్! అయితే మీది చాలా 'ఫార్వర్డు ఫేమిలీ' అన్నమాట! నువ్వు ఎలాగయినా ఈ పనులు చేయించి పెట్టాలి! ఇది నా కారు 'సి' బుక్కు, ఏడాదికి టాక్సు కట్టాలి! ఇది మా అమ్మాయి 'లూనా' లైసెన్సు కాగితం! ఈ ఫోటోలు అతికించి సంతకాలు చేయించాలి! ఇది మా అబ్బాయి కారు లైసెన్సు! ఇదీ డిటోయే! మిగిలినవన్నీ మన డ్రైవె

ట్రర్లవి! ఏ లైసెన్సుకి ఆ ఫోటోలు పెట్టి పిన్ను గుచ్చే వున్నాయి. ఇవన్నీ కాస్త తొందరగా చేయించాలి! టాక్సు కట్టటానికి ఇదిగో రెండు వందలకు డ్రాఫ్టు! మిగిలినవాటికి డబ్బులు అవసరంలేదు! అంటూ కాగితాలు నా ముందరకు తోసి, రెండు వందల రూపాయల డ్రాఫ్టు కూడా అందించేరు.

"వస్తాను సార్! ఈ సాయంకాలం వెళ్ళగానే మీ పని చేయిస్తాను!" అంటూ బయటకు వచ్చేను. మా బాస్‌కి సహాయం చేయగలిగే అవకాశం నాకు వచ్చినందుకు ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయినట్లనిపించింది.

నా సీటు దగ్గర పేపర్లన్నీ సర్ది బీరువాకు తాళంవేసి వాచీ చూసుకున్నాను. కంపెనీ బస్సు బయలుదేరటానికి ఇంకా ఎనిమిది నిమిషాలు మాత్రమే వ్యవధి వుంది. అది కాని తప్పిపోతే సిటీబస్సులో వెళ్ళాల్సిందే! గబగబా గదిలోంచి బయటకువస్తుంటే వీరపాండ్య కట్టబ్రహ్మన్న అడ్డుపడ్డాడు!

వీరపాండ్య కట్టబ్రహ్మన్న అసలు పేరు వరదరాజు మొదలియార్! తమిళ సోదరుడు! మా కంపెనీ వార్షికోత్సవం సందర్భంగా కట్ట బ్రహ్మన్న ఏకపాత్ర అభినయించటంవల్ల అతనికా పేరు స్థిరపడిపోయింది. అతడు మామూలుగా మాట్లాడలేడు! అన్నిటికీ శివాజీగణేశన్‌లా మొహం పెట్టి, పిడికిళ్ళు బిగించి, దవడ కండరాలు మెలిపెట్టినట్లు ఫీలింగ్ ఇచ్చి మాట్లాడతాడు. ఆ మధ్య అతనికి కూతురు పుట్టిందని చెప్పటానికి మా బాస్ రూంలోకి వెళ్ళేడు! అయితే అతని వాలకం, నటకతీరు, పిడికిలి బిగింపులు, ఆవేశం ఇవన్నీ చూసి ఇంక్రిమెంటు ఆపినందుకు కోపంతో తనని కొట్టడానికి వచ్చేడేమోనని మా బాస్ భయపడిపోయి వాచ్‌మేన్‌ని పిలిచి నానా హంగామా చేసేడు! తర్వాత నిజం తెలిసి నవ్వుకోటం జరిగింది.

"మారిదీ...." అన్నాడు మొదలియార్.

"మూర్తీ!" అని పిలవటం సొంపు అది.

అతడికి తెలుగు అర్థం అవుతుంది! కాని అతడు మాట్లాడితే మనకి అర్థం కాదు.

"ఒందు సహాయము దా.... సేయవలె...." అంటూ ఏదో చెప్ప బోయాడు. నేను అర్జెంటుగా అడ్డుపడ్డాను.

"నువ్వు ఇంగ్లీషులోగాని, అరవంలోగాని చెప్పు! తెలుగులో మాత్రం చెప్పకు! అవతల బస్సు వెళ్ళిపోతుంది!" అన్నాను అసహనంగా.

ఇంగ్లీషులో అతని గొడవ అర్థమయి, అతడి దగ్గర రెండు ఫోటోలు, ఒక లైసెన్సు కాగితం తీసుకునేసరికి నాకు అయిదు నిమిషాలు పట్టింది. పరుగున వచ్చి కదుల్తున్న కంపెనీ బస్సెక్కి ఊపిరి పీల్చుకున్నాను.

* * * *

ఇంట్లో అదరాబాదరాగా కాఫీ త్రాగేసి ఎదురుగావున్న ఆర్టీవో ఆఫీసుకు వెళ్ళేను. అక్కడ పరిచయమైన ముఖం వొక్కటీ కనబడలేదు. ఎవరి హడావుడిలో వాళ్ళు వున్నారు. ఈ లైసెన్సుల గురించి ఎవరిని అడగాలో కొంతసేపు అర్థం కాలేదు. ఒక మూల గదిలోకి వెళితే ఒకాయన తీరిగ్గా కూర్చుని సీలింగు ఫేను వంక చూస్తున్నాడు. ఆయన చుట్టూ లైసెన్సు కాగితాలూ, ఫోటోలూ గుట్టలు గుట్టలుగా పడివున్నాయి. నా ఉనికిని సూచిస్తూ చిన్నగా దగ్గేను!

నా దగ్గును ఆయన పట్టించుకోలేదు.

"సార్!" అన్నాను.

"రేప్పొద్దున్న పదకొండు గంటలకు—" అన్నాడాయన చూపు మరల్చకుండా.

నా వెనుక యెవరయినా వున్నారేమోనని అనుమానంతో అటూ యిటూ పరికించాను. ఆ గదిలో మరెవ్వరూ లేరు!

"లైసెన్సులకి ఫోటోలు అతికించి సంతకాలు చేయించాలి సార్!" అన్నాను.

"రేప్పొద్దున పదకొండు గంటలకు!" అన్నాడు.

ఆయనకి చెముడేమోనని అనుమానం వచ్చింది.

"కారు టాక్సు కట్టాలి! ఎక్కడో చెప్తారా?" అన్నాను గొంతు పెంచి.

"రేప్పొద్దున్న పదకొండు గంటలకి—"

"అన్నీ రేప్పొద్దున్నే తీసుకుంటారా?" అతడు విసుక్కోవడం లేదుకనక మళ్ళీ అడిగేను.

"రేప్పొద్దున్న పదకొండు గంటలకి!" ఫీలింగ్సులో, గొంతులో మార్పులేకుండా అన్నాడు.

"దెన్ అయివిల్ కమ్ టుమారో మార్నింగ్! థేంక్యూ!" అన్నాను.

"అయితే ఎల్లుండి పొద్దున్న పదకొండు గంటలకు!" అన్నాడాయన.

"అదేమిటి సార్?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఇంగ్లీషులో మాట్లాడినా, ఇంగ్లీషులో అప్లికేషన్లు రాసినా ఎల్లుండి ఉదయం పదకొండు గంటలకి!—తెలుగులో అప్లికేషన్లయితే ముందు పరిశీలించమని మాకు ఆదేశాలున్నాయి. తెలుగు అప్లికేషన్లు రేప్పొద్దున్న పదకొండు గంటలకు!" అన్నాడు.

ఆయన నోట్లోంచి మరిన్ని కొత్త మాటలు వినగలగటం నాకు నూతనోత్తేజాన్నిచ్చింది.

"వస్తాను సార్! అన్నీ తెలుగులోనే రాస్తాను!" అంటూ వచ్చేశాను.

* * * *

మర్నాడు ఉదయం తొమ్మిది గంటలకు ఆఫీసుకు వెళ్ళిపోయాను.

పది గంటలకు బాస్ రూంలోకి వెళ్ళేను.

"మూర్తీ!మన పని ఎంతవరకూ వచ్చింది?" అన్నాడాయన నన్ను చూస్తూనే.

"సార్. ఉదయం పదకొండు గంటలకు సరిగ్గా రమ్మన్నారు. అందుకని రెండు గంటలు పర్మిషనిస్తే సిటీబస్‌లో వెళ్ళివస్తాను." అంటూ నీళ్ళు నమిలేను.

"భలేవాడివే. నా పనిమీద వెళుతూవుంటే నిన్ను సిటీబస్సులో పంపిస్తానా? బయట డ్రయివరు ఉంటాడు. కారు తీసుకెళ్ళు!" అన్నాడాయన.

ఊహించని ఈ గౌరవానికి నాకు మతి పోయినంత పనయింది. నాకా క్షణంలో మా బాస్ దేవుడిలా కనుపించేడు.

"థెంక్యూ సార్!" అంటూ బయటకు వచ్చేను.

నాకు ఏనుగెక్కినంత సంబరంగా ఉంది. ఈల వేసుకుంటూ గబగబా నా టేబిలుమీద కాగితాలు సర్దేసి బీరువా తాళం వేస్తున్నాను.

"ఏమిటి బ్రదర్! అన్నీ సర్దేస్తున్నావ్? కొంపదీసి ఆఫ్ డే లీవు పెట్టావా?" అన్నాడు ప్రక్క సీటులోని అనంతం!

"లేదు! ఆర్టీవో ఆఫీసుకు వెళ్ళి బాస్ పని చక్కబెట్టుకు రావాలి. ఆయన కారు తీసుకెళుతున్నాను." అన్నాను గర్వం, గంభీరత మిళాయించిన స్వరంతో.

"ఆహా! ఏం అదృష్టం? కార్లో వెళుతున్నావన్న మాట!"

"అవును!" అన్నాను.

"ఇంతకీ ఎక్కడికి వెళుతున్నావో చెప్పేవుకాదు."

అనంతంతో వచ్చిన చిక్కే ఇది! ఒక వాక్యంలో రెండు పనులు చెప్తే ఒకటి మరచిపోతాడు.

"ఆర్. టి.వో. ఆఫీసుకి...." అన్నాను.

"ఆర్. టి. సి. కాంప్లెక్సుకా? ఎందుకు?"

మతిమరుపుతో బాటు సరిగా వినిపించుకోకపోవటం మరో దుర్లక్షణం వీడిలో।

"నీతో ఇంకో అయిదు నిమిషాలు మాట్లాడితే నాకు ఉన్న మతి కాస్తా పోయి ఆర్. ఎమ్. ఎస్. ఆఫీసుకు వెళ్ళిపోతాను. అసలు పనికాస్తా మునిగిపోతుంది" అన్నాను చిరాకుతో.

"ఆర్. ఎమ్. ఎస్" ఆఫీసుకు వెళుతున్నావా? మరి ఆ సంగతి చెప్పవేం? ఈ ఉత్తరం "క్యూ. ఎమ్.ఎస్"లో పడేయ్! అర్జెంటుగా అహ్మదాబాద్ వెళ్ళాలి ఇది!" అంటూ జేబులోంచి ఒక కార్డు తీసి ఇచ్చేస్తూ, దీన్ని క్యూ ఎం ఎస్‌లో పడెయ్యమని వారం దినాల క్రితం మా ఆవిడ నా జేబులో పెట్టింది. రోజూ మరిచిపోతున్నాను!" అన్నాడు మళ్ళీ.

"ఇలా యివ్వు!" అంటూ విసుగ్గా వాడిదగ్గరనుండి కార్డు అందుకున్నాను" దారిలో పడేస్తానులే! అంటూ హామీ ఇచ్చేను.

"దారిలో పడెయ్యకు! "క్యూ.ఎమ్.ఎస్" డబ్బాలో పడెయ్!" అంటూ తనజోక్‌కి తానే ముసిముసిగా నవ్వుకున్నాడు అనంతం!

"హు!" అని విసవిసా నడిచి వచ్చేస్తూంటే "బ్రదర్! ఇలారా! మా తమ్ముడు అనకాపల్లి నుండి నాకు రాసిన ఉత్తరం నీకు ఇచ్చేశాను! అహ్మదాబాద్ ఉత్తరం ఇదుగో, నా జేబులోనేవుంది. దీన్ని తీసికెళ్ళు" అంటూనే ఉత్తరం అందించాడు. అందిస్తూ "సరిగ్గా చూసుకోవేం?" అని సణిగేడు! ఉరుముకున్నట్లు అనంతంవంక చూసి బయటపడ్డాను.

* * *

"ఆడిట" ఆఫీసు ఇంకా ఫర్లాంగు దూరంలో ఉండగానే కారు ఎడంప్రక్కకు తీసి ఆపేశాడు డ్రయివరు!

"ఇంకా ఎదరకివెళితే "పార్కింగ్ స్పేస్" ఉండదుసార్!" అన్నాడు.

కారుదిగి ఆఫీసువైపు నడిచాను.

ఆఫీసు ఎదర తీర్థప్రజలావున్నారు జనం. ఆఫీసులోంచి బయటకు

వచ్చిన క్యూ. రోడ్ అంతా నిండిపోయి మా ఇంటి ప్రహరీలోకి వెళ్ళి పోయింది. ముందుగా జనాన్ని తప్పించుకొని మా ఇంట్లోకి వెళ్ళటానికి ప్రయత్నం చేశాను. కాని జనం వెనక్కి నెట్టేస్తున్నారు. మా ఇంట్లోకి వెళ్ళటంకంటే "ఆర్టీఓ" ఆఫీసులోకి వెళ్ళటమే సులువుగా కష్టపించింది.

"ఈ క్యూ అంతా ఎందుకు?" అని అడిగాను.

ఫోటోలతో లైసెన్సులు "రిన్యూ చేయించుకోటానికి. పదకొండు నుంచి పన్నెండు గంటలవరకే తీసుకుంటారు. పన్నెండు దాటిపోతే మళ్ళీ రేపు రావలసిందే." అన్నారు ఎవరో.

నా గుండెల్లో రాయి పడింది.

మెల్లిగా ఆఫీసు లోపలికి వెళ్ళి నిన్న "రేపొద్దున్న పదకొండు గంటలకి" అంటూ ఆగిపోయిన గ్రామఫోను ప్లేటులా మాట్లాడిన ఆయన కన్పిస్తారేమోనని చూశాను.

ఆయన అదే సీటులో వున్నాడు. చుట్టూ కొంచెం తేడాగానినిన్నటి వాతావరణమే వుంది.

అ చూపుడు వేలితో పెద్ద అట్టని అయస్కాంతం ఇనుపముక్కని దగ్గరకు లాగినట్లు లాగేడు! మంచినీళ్ళ గ్లాసుని చూపుడు వేలితో అమాంతం దగ్గిరకు తీసుకున్నాడు. జేబులోని పెన్నుని చూపుడు వేలుతో బయటకులాగేశాడు.

"సార్! మీరు మంత్రాలు వచ్చునా?" అన్నాను ఆశ్చర్యంగా.

"కాదు. బంక!" అన్నాడాయన నిర్లిప్తంగా.

"బంకా?" అన్నాను నాకేం అర్థం కాలేదు.

"అవును! బంక!" అన్నాడు మళ్ళీ.

"యూ మీన్ జిగురా?" అన్నాను.

"అవును! ముమ్మాటికీ అవును." అన్నాడాయన.

అర్థంకానట్లు ఆయనవంక చూశాను.

"ఈ లైసెన్సుల మీద ఫోటోలు అంటించటానికి ఈ వేలితో బంక రాసి రాసి ఆఖరికి వేలు ఇలా అయిపోయింది. పదిహేనుకోజులబట్టి ఇదేపని చేస్తున్నా. ఎనభైరెండువేల ఫోటోలు అంటించాను. వేలు ఎంత కడిగినా బంక వదలటంలేదు. వేలిచుట్టూ ఒక అంగుళం మేర బంక ఒక పొరలా ఏర్పడిపోయింది" మాటలు ముగించి చూపుడు వేలుతో సిగరెట్టు జేబులోంచి బయటకు లాగేడు.

"ఆయన మాటల్లో "రేప్పొద్దున్న పదకొండు గంటలకు!" అని ఇంతవరకూ దొర్లనందుకు సంబరపడుతూ ఆయన ఎదుట కుర్చీలో కూర్చున్నాను.

"బంక," అంటూ ఆయన ఏదో చెప్పబోయేంతలో నేను ఆయన మాటలకు అడ్డుపడ్డాను సార్! నేను ఈ ఆఫీసు ఎదురింట్లో వుంటు న్నాను. మా ఇంటికి ఎదురుగా ఆఫీసు వుండటంవల్ల నా మిత్రులు చాలా మంది ఆఫీసు పనులు నాకు అప్పజెప్పేరు. బయట క్యూ చూస్తే చాలా పొడవుగా వుంది. పని తొందరగా అవ్వాలంటే ఏం చేయాలిసార్?" అన్నాను వినయంగా.

"వెనక వీధిలో "ఇచ్చట అన్నిరకముల మోటారు వాహనములకు సంబంధించిన ఆఫీసు పనులు చేయబడును" అనే బోర్డుతో ఒక బ్రోక రాఫీసు ఉంటుంది "అక్కడికి వెళ్ళండి" అని "మేం చెప్పకూడదుమీకు! అక్కడికి వెళ్ళి చేయించుకుంటే పనిఅరగంటలో అయిపోతుందని అసలు చెప్పకూడదు. అందరూ చెప్పినా నేనుమాత్రం అస్సలు చెప్పకూడదు, ఎందుకంటే ఆ బ్రోకరాఫీసు మా మావమరిదిదే కనుక! మీరు ఇక్కడ అసలు కూర్చోకూడదు." అన్నాడాయన.

"థాంక్యూసార్!" అంటూ కుర్చీలోంచి బయటకు వచ్చేస్తూవుంటే "చూడండి." అంటూ బంకగారు పిల్చేడు.

"ఆ ఫోటోలు వూడబెరికి అలా టేబిలుమీద వుంచండి!" అన్నారు

"ఏ ఫోటోలు?" అన్నాను ఆశ్చర్యంగా.

"మీరు వెనక్కి తిరగండి! అని నేను తిరగ్గానే ఆరు ఫోటోలని లెక్కపెడుతూ నా ఫేంటు వెనుక భాగంనుండి వూడబెరికాడాయన.

"మీరు కుర్చీలో కూర్చోబోతూ వుంటే "బంక" అంటూ చెప్ప బోయాను! మీరు విన్నారుకాదు! లైసెన్సుల పైన అంటించటానికి ఆరు ఫోటోలకి బంకరాసి రెడీగా కుర్చీలో ఉంచాను. మీరు వాటిమీద కూల బడ్డారు, అన్నాడాయన.

రుమాలుతో పేంటు వెనుక భాగానికి అంటిన బంక తుడుచు కుంటూ బయటకు వచ్చేను.

అక్కడి నుండి బ్రోకరాఫీసుకు వెళ్ళేను!

అక్కడ ఆఫీసులో ఆయన నన్ను చూడగానే ఎదురుగావచ్చి చేతి లోని కవరు లాక్కొని కాగితాలు బయటకు తీసి "టాక్సుకి సాదరు పది, రిన్యూవల్‌కి సాదరు ఐదు" అంటూ ఎక్కాలు వల్లించినట్లు గబగబా లెక్కకట్టి" మొత్తం సాదరు అరవై అయిదు రూపాయలు అవుతుంది. డబ్బిచ్చి ఇక్కడే కూర్చోండి" అరగంటలో మీపని చేయించుకొస్తాను!" అంటూ నా జేబులోంచి చొరవగా వందరూపాయలనోటు లాగి, "ఒరే! కుర్రాడా! చూసుకో ఇప్పుడే వస్తాను" అంటూ ఓ కుర్రాడివంక చూసి, నా కవరూ, డబ్బూ పట్టుకుని హడావిడిగా ఆఫీసువైపు వెళ్ళిపోయాడు.

నేను మంత్రముగ్ధునిలా అలాగే వుండిపోయాను- అయిదు నిమి షాలు.

"అలా కూర్చోండి సార్!" అంటూ ఆ కుర్రాడు చెప్పటంతో కుర్చీలో కూలబడ్డాను.

అన్నమాట ప్రకారం సరిగ్గా అరగంటలో "సి" బుక్కులు, లైసె న్సులు ఎదుట పడేశాడు. వందరూపాయల్లో మిగిలిన డబ్బు లెక్కచెప్పి అప్పగించేడు. తిరుపతి గుడి క్యూలో దైవదర్శనార్థం వేలాది ప్రజలువేచి ఉండగా, తిన్నగా పాతిక రూపాయల టిక్కెట్టు మీద లోనికి వెళ్ళి

వచ్చేస్తే ఎలా అన్పిస్తుందో, ఆ క్షణంలో సరిగా నాకు అలాగే అని పించింది.

విజయగర్వంతో కాగితాలు తీసుకుని బయటకు వచ్చాను.

అంతే ఆ రోజునుంచే ప్రారంభం!

నేను ఆర్టీవో ఆఫీసులో పనులు క్షణాలమీద చేయించగలనని మా కంపెనీలో అందరికి తెలిసిపోయింది.

ఆ వారం ఆఖరుకు లెక్కకడితే మూడువందల నలభై రూపా యలు బ్రోకరుకు నేను జేబులోంచి స్వంతంగా చెల్లించినట్లు తేలింది!

అప్పుడే మెరుపులా నాకు ఒక ఆలోచన వచ్చింది.

ఆ ఆలోచనా ఫలితంగా నా జీవన విధానం మారిపోయింది.

అంతే! పదిహేను వందల రూపాయలు నెలకు తెచ్చుకునే నా ఉద్యోగానికి రాజీనామా చేసేను!

ఇదంతా ఆరు నెలల క్రిందటి సంగతి!

ప్రస్తుతం మీరు మా ఇంటికి వస్తే వీధి గడికి ఒక బోర్డు వేలా డుతూ కన్పిస్తుంది. ఇచ్చట ఆర్. టి.వో. ఆఫీసుకి సంబంధించిన అన్ని పనులూ సరసమయిన ధరలకు చేయబడును" అని దానిమీద వ్రాయబడి వుంటుంది.

"బంగారంలాంటి కంపెనీ ఉద్యోగం వదులుకుని ఆఖరుకు బ్రోకరు ఉద్యోగం ప్రారంభించేవా? ఇదేం బంగారం షాపు అనుకున్నావా-నమ్మిన వాళ్ళని దోచుకు తినటానికి?" అని నా మిత్రులు, శ్రేయోభిలాషులు ఇప్ప టికీ నన్ను మందలిస్తూనే వున్నారు.

అయితే ఆ ఉద్యోగంకన్నా ఈ బ్రోకరు పని ఎంత లాభసాటిగా వుందో వాళ్ళకేం తెలుసు?

"ఉద్యోగం పురుషలక్షణం" అన్నారు పెద్దలు! నేను కాదనను!

ఈ బ్రోకరు పని "మహా పురుషలక్షణం!" అంటాను నేను!

కాదనేవాళ్ళను నా దగ్గరకు తీసుకురండి! వివరిస్తాను వాళ్ళకి!

(1983 ఆంధ్రసచిత్ర వారపత్రిక)